# ఓ రుప్ప

ఆఫీసు గేటు బయట నిల్చున్న మార్వాడీని చూడగానే చెమటలు పట్టాయి రమణకి.

"రెండ్రోజుల్లో నాకివ్వాల్సిన మొత్తం ఇచ్చేయండి....వాయిదా వేసి కారణాలు ఏమిచెప్పినా ఈసారి నేను వినదల్చుకోలేదు." మార్వాడీ బెదిరింపులతో రమణకు గుండెదడ పెరిగిపోయింది.

అప్పులు చేయడం అతని హాబీకాదు. అలాగని అతనికి దురలవాట్లేమైనా వున్నాయా అని అనుమానించడమూ తప్పే!

తనకి పెళ్ళి కాకపోయినా - చదువులు పూర్తి కాని, జీవితంలో ఇంకా స్థిరపడని తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వున్నారు. వాళ్ళంటే అతనికి అమితమైన ప్రేమ వుంది. అది చాలదూ అతను అప్పుల పాలవడానికి?

ఎప్పటికప్పుడు ఏదో ఓ అవసరం గండంలా తయారవుతోంది. ఆ గండాన్ని గట్టెక్కించుకోవడానికి ఎక్కడో ఒకచోట వడ్డీకైనా డబ్బు తీసుకొచ్చి సర్దాలి. లేకపోతే ఇన్నాళ్ళు వాళ్ళకోసం పడ్డ శ్రమ బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. అలా కాకూడదనే తాపత్రయం అప్పుని పెంచేస్తోంది.

రెండ్రోజుల్లో అప్పుని తీర్చడం ఎలా? ఎవరిని అడగాలి?

—రమణకు అర్థం కావడం లేదు.

నెమ్మదిగా సైకిలెక్కి బయల్దేరాడు - తెలిసిన ఒక్కొక్కళ్ళనే అప్పు అడుగుతూ! అప్పటికే వాళ్ళలో చాలా మంది దగ్గర తీసుకుని వుండడంతో ఎక్కడా అప్పు పుట్టలేదు.

జేబులో వున్నది యాభై రూపాయలు, తీర్చాల్సిన అప్పు అయిదొందలు!

ఎలా? ఎలా?

—హఠాత్తుగా గుర్తుకొచ్చాడు రూప్‌సింగ్. దాదాపు నాల్గు నెల లైంది అతను తన దగ్గర రెండొందలు తీసుకుని....ఇంతవరకూ ఇవ్వ లేదు....ఏమైనా సరే ఇవాళా సొమ్ము ని వసూలు చేయాలి, మరో వందతో!

రమణ వెళ్ళేసరికి రూప్‌సింగ్ ఇంట్లోనే వున్నాడు.

"గురూ! అర్జంటుగా నా డబ్బు నాకివ్వు. మరో వంద కూడా ఎక్కువ కావాలి...." గబగబా అడిగేయాలనుకున్నాడు రమణ.

అసలే తెల్లగా వుండే రూప్‌సింగ్ ముఖం మరింత తెల్లగా పాలి పోయివుంది.

"మా అబ్బాయికి బాగుండడం లేదు....మందులకి డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నాను. వచ్చే నెల నీ డబ్బు నీకిచ్చేస్తా...." అతని కంగారు మాటల్లో ప్రతిధ్వనించింది.

వెంటనే రమణ చేయి జేబులోకి వెళ్ళింది.

యాభై నోటుని తీసి రూప్‌సింగ్ చేతిలోపెట్టి, ''ఈ యాభై ని వుంచు.... మొత్తం వచ్చే నెల్లో ఇద్దుగాని.'' చటుక్కున వెనుతిరిగి సైకి లెక్కాడు రమణ.

ఈ యాభైతో తన అవసరం ఎలానూ తీరదు. అతని అవసరమైనా తీరుతుంది. జీవితంలో ఒక్కడికైనా అప్పు పెట్టానన్న ఆనందమూ వుంటుంది. ఈ ఆలోచన చాలు తనలో ఓర్పు పెంచడానికి! అతని ఆలోచనలు రకరకాల సాగుతున్నాయి.

(ఈవారం వారపత్రిక)